ప్రజాశక్తి
సోమవారం 10 నవంబర్ 2025
5
అనంతపురం

తొమ్మిదేళ్ల చిన్నారి తైక్వాండో విన్యాసం

ఆరు నిమిషాల్లో 100 ట్యూబ్‌లైట్లు ఫటాఫట్

చిన్నారి యశస్విపై ట్యూబ్‌లైట్ పగులగొడుతున్న దృశ్యం

తాడిపత్రి రూరల్ : పట్టణంలో చిన్నారి యశస్వి భారతి కేవలం ఆరు నిమిషాల్లో 100 ట్యూబ్‌లైట్లు తలపై పగులగొట్టించుకుని సాహసం చేసింది. పట్టణ పరిధిలోని ఓ తైకాండో అకాడమీలో నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించే దిశలో ఆదివారం సాహసం చేసినట్లు కోచ్ తెలిపారు. అనంతరం తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ శివయ్యతో కలిసి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులు, ప్రయాణికుల భద్రతకు నిఘా ఏదీ..?

గుత్తి రైల్వే స్టేషన్

నిత్యం చోరీలు పట్టించుకోని రైల్వే శాఖ

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ప్రస్తుతం తరుణంలో రైల్వే ఆస్తులు, ప్రయాణికులకు రక్షణ కరువైంది. నేరాల నియంత్రణలో ముఖ్య పాత్ర పోషిస్తున్న నిఘా నేత్రాలను అన్ని శాఖలు వినియోగించుకుంటున్నాయి. అయితే దేశంలో అతి పెద్ద వ్యవస్థ అయినా రైల్వే శాఖ అందుకు విరుద్ధంగా ఉంటోంది. రైల్వే ఆస్తులు, ప్రయాణికుల భద్రతను అధికారులు గాలికి వదిలేసింది.

ప్రజాశక్తి - గుత్తి

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని గుత్తి రైల్వే జంక్షన్ (రైల్వే స్టేషన్)లో ఇటీవల నేరాలు అధికంగా జరుగుతున్నాయి. నేరాల నియంత్రణకు ఉపయోగపడే నిఘా నేత్రాలు అరకొరగా ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం గుత్తి రైల్వే స్టేషన్ పరిసరాలు, టికెట్ బుకింగ్ కార్యాలయం, రైల్వే కాలనీలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు (సిసి కెమెరాలు) మరమ్మతులకు గురయ్యాయి. చాలా కాలంగా మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలను బాగు చేయకుండా రైల్వే శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. గుత్తి రైల్వే స్టేషన్ లో నాలుగు సీసీ కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయి. మెట్ల వద్ద ఒక సిసి కెమెరా, రైల్వే స్టేషన్ మేనేజర్ కార్యాలయం ఇరువైపులా రెండు నిఘా నేత్రాలు, జిఆర్‌పి పోలీస్ స్టేషన్ ఎదుట ఒక సీసీ కెమెరా మాత్రమే ఉంది. రైల్వే సిగ్నలింగ్ అండ్ టెలికాం విభాగం పర్యవేక్షణలో సీసీ కెమెరాల నిర్వహణ జరుగుతోంది. రైల్వే స్టేషన్ పరిధిలో 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. రైల్వే స్టేషన్ లో చోరీలు అధికంగా జరుగుతున్నా రైల్వే శాఖ పట్టించుకోవడం లేదు. రైల్వే టికెట్ బుకింగ్ కార్యాలయం ఎదుట పార్కింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనాలను అపహరణకు గురవుతున్నాయి. రైల్వే ప్రయాణికులకు సంబంధించిన నగదు, బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లను దొంగలు ఎత్తుకెళుతున్నారు. రైల్వే బుకింగ్ కార్యాలయం ఎదుట పార్కింగ్ చేసిన రైల్వే స్టేషన్ మాస్టర్ ఎ.సురేష్ బాబుతో పాటు రైల్వే అధికారులు, కార్మికులు, ప్రయాణికుల ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. అలాగే టికెట్ బుకింగ్ కార్యాలయం పక్కన ఉన్న ఏటీఎం లో గతంలో రైల్వే ప్రయాణికుడు రూ.5వేలు నగదును డ్రా చేశాడు. అది గమనించిన ఓ దొంగ ఆ డబ్బును దోచుకుని పారిపోయాడు. రైలు ఫ్లాట్‌ఫారం పై కూర్చున్న ఓ బాలుడుని ఓ దుండగుడు మచ్చిక చేసుకుని అక్కడ నుంచి ఆ పిల్లవాడిని తీసుకొని ఉడాయించాడు. అయితే ఆ అంగతకుడు బాలుడిని తీసుకువెళుతున్న దృశ్యం మెట్ల పక్కన ఉన్న సిసి కెమెరాలో మాత్రమే రికార్డు అయింది. మిగతా చోట్ల సిసి కెమెరాలు లేకపోవటంతో ఆ అగంతకుడు పిల్లవాడిని తీసుకుని ఎటు వెళ్లాడో తెలుసుకోలేకపోయాడు. శనివారం టికెట్టు బుకింగ్ కార్యాలయం వద్ద ఉన్న రైల్వే ప్రయాణికుడి సెల్ ఫోను దుండగుడు దొంగలించి పారిపోతుండగా ఆటోడ్రైవర్లు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అయితే ఆ దొంగ వారి కళ్లు కప్పి పారిపోయాడు. ఇలా చాలా చోరీలు జరుగుతున్నాయి. చోరీలకు సంబందించి కొందరు బాధిత ప్రయాణికులు మాత్రమే ఫిర్యాదు చేస్తున్నారు. మరి కొంతమంది రైళ్లు రావడంతో అక్కడ నుంచి వాటిని ఎక్కి వెళ్లి పోతున్నారు. చోరీలకు పాల్పడ్డ దొంగలను పట్టుకోవడంలో రైల్వే పోలీసులు విఫలమవుతున్నారు. అలాగే గుత్తి రైల్వే స్టేషన్ గుండా అక్రమ రవాణా అధికంగా జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గుంతకల్లు రైల్వే స్టేషన్ వద్ద సీసీ కెమెరాలును అధికారులు ఏర్పాటు చేశారు. గుత్తిలో స్టేషన్ కు సరిపడా సిసి కెమెరాలు లేకపోవడంతో గంజాయి, నకిలీ మద్యం బాటిళ్లు, నిషేధిత మత్తు పదార్థాలు రవాణా జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైల్వే పరిసర ప్రాంతాల్లో ఉంటున్న ఇనుప కమ్మీలు, సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించిన పరికరాలు, ఎలక్ట్రికల్ పరికరాలు, తుక్కు చోరీకి గురికాకుండా నిఘా నేత్రాలు ఎంతో ఉపయోగపడనున్నాయి. అంతేకాక ఇంటినుంచి పారిపోయి వచ్చిన బాలబాలికలు ఈ రైల్వే స్టేషన్ నుంచి ఏ రైలు ఎక్కారో తెలుసుకోవటానికి కూడా అవకాశం ఉంటుంది. సీసీ కెమెరాలు ఉంటే వాటి ద్వారా పోలీసులు చోరీ కేసులను తొందరగా ఛేదించే అవకాశం ఉంది.ఇప్పటికైనా రైల్వే శాఖ స్పందించి నేరాలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గుత్తిలోని రైల్వే ప్లాట్‌ఫాం

రైల్వే అధికారులు దృష్టి సారించాలి

నేరాల నియంత్రణకు రైల్వే గుంతకల్లు డివిజన్ అధికారులు దృష్టి సారించాలి. అక్రమ రవాణాను అరికట్టాలి. రైల్వే ఆస్తులు, రైల్వే ప్రయాణికులకు భద్రత కల్పించాలి. ప్రయాణికులు సురక్షితంగా గమ్యం చేరేందుకు చర్యలు చేపట్టాలి.

జిఎం.బాషా,
డిఆర్ యుసిసి మాజీ సభ్యుడు,

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

గుత్తి రైల్వేస్టేషన్ లో తగినన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. రైల్వే పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అరకొరగా ఉన్నాయి. రైల్వే స్టేషన్ వద్ద చోరీలు అధికంగా జరుగుతున్నాయి. చోరీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

కెఎం.రంగనాయకులు,
గుత్తి ఆర్ఎస్.

తెలుగు తమ్ముళ్ల బరితెగింపు

వార్త రాసినందుకు ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై భౌతికదాడి

ఫోన్ లాక్కొని.. కర్రలతో విచక్షణరహితంగా కొట్టిన వైనం...

కర్రలతో దాడిచేయడంలో విలేకరి శంకర్ వీపుమీద ఏర్పడిన గాయాలు

ప్రజాశక్తి- చిలమత్తూరు

సిఎం బావమరది, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఇలాకాలో తెలుగు తమ్ముళ్లు బరితెగించారు. వార్త రాసాడన్న అక్కసుతో ఊగిపోయిన టిడిపి నాయకుడు తన కుమారుడు, అనుచరులతో కలసి దారి కాసి విలేకరిపై భౌతికదాడికి పాల్పడ్డారు. కర్రలతో చితకబాదారు. తెలుగు తమ్ముళ్ల మానవమృగాల్లా వ్యవహరించిన ఈ ఘటన్ల హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలంలో చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు... చిలమత్తూరు మండల కేంద్ర పరిధిలో రూ. 45 లక్షలతో ఎన్ఆర్ఇజిఎస్ కింద జరుగుతున్న సిసి రహదారి పనుల్లో నాణ్యతపై ఆ మండల ప్రజాశక్తి విలేకరి శంకర్ 'నాశిరకంగా రోడ్డు నిర్మాణం' శీర్షికన వార్తను రాశాడు. ఈ కథనం ఆదివారం ప్రచురితమైంది. దీన్ని జీర్ణించుకోలేని టిడిపి మండలనాయకుడు నాగరాజు యాదవ్ ప్రజాశక్తి విలేకరిపై దాడికి కుట్ర పన్నాడు. ఆదివారం ఉదయం విలేకరి ఇంటివద్దకు వెళ్లాడు. శంకర్ అందుబాటులోలేక పోవడంతో అతని కుటుంబ సభ్యులను బెదిరించాడు. అంతటితో ఆగక 'ఇంటి దగ్గరకు లేకపోతే రోడ్డులోకి రా' అని ఫోన్ ద్వారా శంకర్‌ని పిలిచాడు. ఈ నేపథ్యంలో శంకర్ తల్లి శంకర్‌కు ఫోన్ చేసి తమను బెదిరించినట్లు ఏడ్చుకుంటూ చెప్పింది. దీంతో బయటకు వెళ్లిన శంకర్ తన ద్విచక్రవాహనంలో ఇంటికి బయలు దేరాడు. అప్పటికే దారికాచి ఉన్న టిడిపి నాయకుడు నాగరాజు, ఆయన కుమారుడు, తన అనుచరులతో కలసి శంకర్ ద్విచక్రవాహనాన్ని శిరా రహదారి తుమ్మలకుంట క్రాస్ వద్ద అడ్డగించాడు. మొదట శంకర్ వద్ద ఉన్న ఫోన్‌ను లాక్కొన్నారు. ఆ సమయంలో వారి వద్ద ఉన్న కర్రలను చూసి భయపడిన శంకర్ పారిపోయేందుకు ప్రయత్నించగా వాహనం తాళం లాక్కొన్నారు. అప్పటికే తమతో తెచ్చుకున్న పెద్ద పెద్ద కర్రలతో విలేకరి శంకర్‌ను విచక్షణ రహితంగా బాదారు. దీంతో విలేకరి శంకర్ హైవే గుండా పారిపోయి వచ్చి చిలమత్తూరు స్టేషన్ చేరుకున్నాడు. అక్కడ పోలీసులు అందుబాటులో లేకపోవడంతో తన బంధువుల ఇంట తలదాచుకున్నాడు. తోటి విలేకర్ల సహాయంలో ఆదివారం సాయంత్రం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ మునీర్‌అహ్మద్‌కు ఫిర్యాదు చేశాడు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : శ్రీసత్యసాయిజిల్లా చిలమత్తూరు మండల ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై జరిగిన దాడిని ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, డిప్యూటీ ఎడిటర్ రాంభూపాల్ ఖండించారు. దాడికి పాల్పడిన టిడిపి నాయకుడు నాగరాజుయాదవ్, అయన అనుచరులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాస్తవాలను వెలికితీసే విలేకరులపై ఇలా దాడి చేయడం నియంతృత్వ చర్య అని అన్నారు.

ముగిసిన 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా ఉత్సవాలు

ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అనంతపురం

పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తి నింపిన మంత్రులు

విజేత అనంతపురం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్‌డిటి క్రీడా మైదానంలో ఈ నెల 7,8,9 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించిన 7వ రాష్ట్ర స్థాయి క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. మూడవ రోజు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత హాజరై ఉదయం ఉంచి రెవెన్యూ క్రీడాకారులతో పలు పోటీల్లో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించారు. క్రీడల ముగిసిన నేపథ్యంలో బహుమతుల ప్రధానోత్సవ సభ నిర్వహించారు. ఏపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన క్రీడా ఉత్సవాలు ముగింపు కార్యక్రమానికి మంత్రులతో పాటు, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడంబి శ్రీకాంత్, భారత టెన్నిస్ క్రీడాకారుడు మైనేని సాకేత్, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, పల్లె సిందూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ క్రీడా సాంస్కృతిక ఉత్సవాల్లో రెవెన్యూ ఉద్యోగులు మూడు రోజుల పాటు పని ఒత్తిడి మరిచిపోయి పోటీల్లో పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పొందడం ఆనందంగా ఉందన్నారు. పారదర్శకమైన ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు పాత్ర ఎంతో కీలకం అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఇది ఉద్యోగుల ప్రభుత్వం అని సమాజాన్ని బాగు చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. మంత్రులు జిల్లాల అభివృద్ధికి పని చేసే మొదటి కూలీలు అన్నారు. పోలీస్ రెవెన్యూ శాఖ సేవలు ఎంతో కీలకం అన్నారు. రెవెన్యూ సేవలు ఎలా సులభతరం చేయలనే దానిపై దృష్టి సారిద్దామనిఅన్నారు. రెవెన్యూ క్రీడలను అధికారులు అందరూ చక్కగా నిర్వహించారని అభినందించారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు క్రీడాకారులు జిల్లాకు వచ్చి క్రీడా పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా అనంతపురం జిల్లా నిలిచింది. క్రికెట్‌లో విజేతగా నిలిచిన అనంతపురం జట్టుకు మంత్రులు ట్రోఫీ అందజేసి అభినందించారు. అనంతరం ఆయా క్రీడాపోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, తెలంగాణా రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రరెడ్డి, ఏపి రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటరాజేష్, ఆర్‌డిఓ కేశవనాయుడు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య'తో పిల్లల పరిరక్షణ

బాలల పరిరక్షణ జిల్లా అధికారి మహేష్

ప్రజాశక్తి- పుట్టపర్తి అర్బన్

మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖలో అంతర్భాగమైన మిషన్ వాత్సల్య పథకం ద్వారా పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాల వయసు వరకు ఉన్న అనాథల ఆదరణ సంరక్షణ అవసరమైన పిల్లలకు వసతి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ తెలిపారు. ఆదరణ కరువై దిక్కులేని బాలలకు తగిన ఆశ్రయం కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ శాఖ ద్వారా బాలల సంరక్షణ కార్యక్రమం చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలు పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : అనాథ, ఆదరణ కరువైన పిల్లల కోసం మీరు తీసుకొంటున్న చర్యలు ఏమిటి.?

అధికారి : ప్రభుత్వం ఇలాంటి అనాథలు, ఆదరణ కరువైన పిల్లల కోసం ప్రత్యేకంగా మిషన్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టింది. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాలు వయస్సులోపు ఉన్న వారిని గుర్తించి వారికి తగిన ఆశ్రయం కల్పించి సంరక్షించడం జరుగుతుంది. అందుకు ప్రత్యేకంగా ప్రభుత్వం బాలల కోసం బాల సదనాలు ఏర్పాటు చేసింది. వారి ఆలనా పాలనా విద్య ఆశ్రయం కల్పించడం జరుగుతుంది.

ప్ర: జిల్లాలో ఎన్ని బాల సదనాలు ఉన్నాయి.? వాటి పనితీరు తెలపండి.?

అధికారి : సత్య సాయి జిల్లాలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా రెండు బాల సదనాలు ఉన్నాయి. అవి ధర్మవరం, హిందూపురంలో ఉన్నాయి. ప్రతి బాలసదనంలో ఆశ్రయం కల్పించడంతోపాటు ఒకటవ తరగతి నుంచి 6వ తరగతి వరకు ఉచిత విద్యను అందించబడుతుంది. అనాధలు, పాక్షిక అనాధ పిల్లలు, పోషించలేని స్థితిలో ఉన్న వారిని ఇక్కడ చేర్పించడం జరుగుతుంది. ఈ బాల సదన్ లో బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆశ్రయం కల్పించడం జరుగుతుంది. అప్పుడే పుట్టిన పిల్లలు అనగా చెత్త కుప్పలో వదిలివేసిన పిల్లలను శిశుగృహంలో ఉంచి బాలల సంక్షేమ సమితి ద్వారా వారి సంబంధికులు రెండు నెలల వరకు కూడా రాని పక్షంలో అనాధగా ప్రకటించి చట్టబద్ధంగా దత్తత కురేవారికి అప్పగించడం జరుగుతుంది. పూర్తి అనాథలకు, పాక్షిక అనాధలకు, మానసిక, శారీరక వికలాంగులకు, హెచ్ఐవి ఉన్న బాలలకు ప్రతినెల ఒక్కొక్కరికి నాలుగు వేల రూపాయలు ప్రభుత్వం మూడేళ్లపాటు సాయం అందిస్తుంది.

ప్ర: మీ శాఖ ద్వారా ఇంకా చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి.?

అధికారి : బాలల హక్కులు వారి సంరక్షణ, బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలు, బాలల పై జరిగే లైంగిక దాడులు తదితర విషయాల గురించి ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందుకు హెల్ప్‌లైన్ 1098 వినియోగించుకోవాలని కోరుతున్నాం. ఎక్కడైనా అలాంటి సంఘటనలు జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చు. జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్లో సంబంధిత అధికారులకు బాల్య వివాహాల నిరోధక చట్టం, లైంగిక నేరాల నిరోధక చట్టం. బాలల న్యాయ చట్టం పై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం.

ప్ర: కిశోరి వికాసం కోసం చేపడుతున్న చర్యలు ఏమిటి.?

అధికారి : కిశోరి వికాసం బాలల యొక్క సాధికారిక అనే నినాదంతో కలెక్టర్, ఐసిడిఎస్ పీడీ ఆదేశాలతో కిశోరి వికాసంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు చేపడుతుంటాము. బాల్యవివాహాలు నిరోధించడం, వ్యక్తిగత పరిశుభ్రత, యోగ, ఆత్మరక్షణ, ట్రాఫికింగ్ తదితర అంశాలపై ప్రతి మండలంలోని రిసోర్స్ పర్సన్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు శిక్షణ పొందిన వారు పాఠశాలల్లో, కళాశాలలో 11 నుంచి 18 సంవత్సరాల వయసు గల వారికి అవగాహన కల్పించడానికి కృషి చేస్తారు. 11 నుంచి 14 ఏళ్ల బాల బాలికలకు గ్రూపులు ఏర్పాటు చేసి పిల్లల సమస్యలపై తెలుసుకోవడం జరుగుతుంది. బాల బాలికలు సమస్యలపై కరపత్రాలు, గోడ పత్రికల ద్వారా ప్రచారం చేయడం జరుగుతుంది.

ప్ర: ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

అధికారి : అనాధ పిల్లల పట్ల సానుభూతిగా ఉండాలి. గ్రామాల్లో బాల్య వివాహాలు, లైంగిక దాడులు జరిగిన వెంటనే అక్కడి అంగన్వాడీలకు, హెల్ప్‌లైన్‌కు తెలపాలని కోరుతున్నాం. అలాగే గ్రామస్థాయి కమిటీలకు సహకరించాలని కోరుతున్నాం.

ఎంపికైన తైక్వాండో జిల్లా జట్టు

తైక్వాండో జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు 39వ సబ్ జూనియర్, 8వ క్యాడెట్, 41వ సీనియర్ తైక్వాండో కొరిగి, పూమ్సే పోటీలకు ఆదివారం ఛాంపియన్ తైక్వాండో అకాడమీలో జిల్లాజట్టును ఎంపిక చేశారు. ఈ జట్టు నవంబర్ 14 నుంచి 26వ తేదీ వరకూ కాకినాడలో జరగనున్న పోటీల్లో పాల్గొననుంది. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, శిక్షకులు శాంతరాజ్, రామాంజి, తులసి, రాజేష్, శ్రీకాంత్, యోగానంద, ప్రదీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ సదస్సుకు హాజరైన కమిషనర్ బాలస్వామి



ఢిల్లీలోని సదస్సులో ప్రముఖులతో అనంతపురం కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్ : నవంబర్ 8, 9వ తేదీల్లో న్యూఢిల్లీలోని ఇండియా ఇన్ఫర్మేషన్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన అర్బన్ ఎన్‌క్లేవ్ సదస్సుకు అనంతపురం కమిషనర్ బాలస్వామి హాజరయ్యారు. ఈ సదస్సులో ఏడు అంశాలను చర్చించారు. నైపుణ్యాల సామర్థ్యం పెంపు, సుపరిపాలన, జచీణ, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, జీవనోపాధి అభివృద్ధి, పట్టణ చలనీనత, ఇతర ముఖ్య విషయాలపై చర్చించారు.

వైసిపి నాయకులకు తగ్గని అహంకారం

టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్

ప్రజాశక్తి-నార్పల

వైసిపి నాయకులకు అధికారం పోయినా అహంకారం తగ్గలేదని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ విమర్శించారు. నార్పల మండలం నాయనపల్లి గ్రామంలో వైసిపి నాయకుల చేతిలో గాయపడిన మాజీ సర్పంచు కుమారుడు వెంకటరాముడును ఆదివారం అనంతపురంలోని పెద్దాసుపత్రిలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడుతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులతోపాటు ఆ పార్టీ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి శైలజనాథ్.. గుర్తు పెట్టుకో.. ఇది వైసిపి ప్రభుత్వం కాదు.. ప్రజా కూటమి ప్రభుత్వం.. మీ ఆటలు సాగవన్నారు. పచ్చని పల్లెల్లో చిచ్చు రేపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 1983 నుంచి నివాసంలో ఉంటున్న స్థలంలో గోకులం షెడ్డు నిర్మించుకుంటున్న ఎస్సీ కులానికి చెందిన వెంకటరాముడుపై మూకుమ్మడిగా దాడికి పాల్పడటం దారుణమన్నారు. వారంరోజుల క్రితం తహశీల్దార్, మండల సర్వేయర్ సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారన్నారు. అయినా వైసిపి వారికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే చట్టపరంగా వెళ్లాలేగానీ దాడి చేయడం నీచమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ యర్రనాగప్ప, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ తలారి కుళ్లాయప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి పిల్ లక్ష్మీనారాయణ, ఈడిగ జిల్లా సాధికారక ఛైర్మన్ నాగరాజు, యూనిట్ ఇన్‌ఛార్జి వెంకటేష్, గంగాధరనాయుడు, ఎంపిటిసి భూషణ, మాజీ సర్పంచు ఓబులేష్, శంకరయ్య, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

పేదలకు ఉచిత న్యాయసేవలు

జాతీయ న్యాయ సేవా దినోత్సవంలో జడ్జిలు

మాట్లాడుతున్న గుత్తి జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.శ్వేత

ప్రజాశక్తి-గుత్తి

సమాజంలో ఆర్థికంగా వెనకబడిన నిరాశ్రయు పేద ప్రజలకు ఉచితంగా న్యాయసేవలు అందిస్తామని గుత్తి జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.శ్వేత అన్నారు. ఆదివారం పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ న్యాయ సేవా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పౌరులందరికీ న్యాయం పొందే హక్కు ఉందన్నారు. ఆర్థిక స్తోమత లేని వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయన్నారు. పేదలు న్యాయం కోసం మండల న్యాయ సేవా సమితి, జిల్లా న్యాయ సేవా సమితిలను ఆశ్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది విసి గంగాధరకుమార్, కోర్టు టైపిస్ట్ ఎస్.సాధిక్‌వలి, పారాలీగల్ వాలంటీర్లు ఎం.ఇస్మాయిల్, తన్నీరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : పేద, బలహీనులకు ఉచిత న్యాయ సహాయం అందించనున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి భాను తెలిపారు. ఆదివారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి న్యాయ సహాయం అందిచడమే లక్ష్యమన్నారు. 1995లోనే న్యాయసేవలను అందుబాటులోకి తీసుకురాగా 1987లోనే న్యాయసేవల చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దేవేంద్ర, దాదాఖలందర్, అలెక్స్, కక్షిదారులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-పామిడి

పట్టణంలోని భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా శంకర కంటి వైద్య నిపుణులు డాక్టర్ షిప్పా 240 మందికి పరీక్షించి 75 మందిని కంటి ఆపరేషన్‌కు సిఫారసు చేశారు. ఈ వైద్యశిబిరంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, జిల్లా ఛైర్‌పర్సన్ డాక్టర్ శాంతి ప్రియ, క్లబ్ కోశాధికారి డి.షేక్షావలి, క్లబ్ నిర్వాహకులు, ఆర్ఎంపి వైద్యులు గంగశేఖర్, మార్కెటింగ్ ఛైర్మన్ తూర్పింటి ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పత్రా నరేష్‌కుమార్, సర్వీస్ ఛైర్మన్ మహేష్, డైరెక్టర్లు ఎ.నాగరాజు, పత్రా రాకేష్, ప్రభాకర్, శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివ, లక్ష్మీ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ ఛాంపియన్ షిప్ 'అనంత'

అతిథులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక మాంటిస్సోరీ ఎలైట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహిస్తున్న 69వ ఎపి ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 14, 17, 18వ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ ఛాంపియన్‌షిప్‌లో అనంతపురం క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనపరచి ఐదు విభాగాల్లో కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ మల్లారెడ్డి, మాంటిస్సోరీ ఎలైట్ పాఠశాల కరస్పాండెంట్ భరత్, కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, శ్రీవాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రభాకర్, రాజశేఖర్‌రెడ్డి, సుగుణమ్మ, శ్యామల, శ్రీదేవి, శిరీషా, శ్రీదేవి, లీలారాణి, ప్రభాకర్, రమేష్, రాజశేఖర్, రామాంజినమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల నూతన కార్యవర్గం ఏర్పాటు

సంఘీభావం తెలుపుతున్న సంచార జాతుల కార్యవర్గం సభ్యులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ఎపి ఎన్‌జిఒ భవన్‌లో కార్యక్రమంలో ఆదివారం ఎపి సంచార జాతుల సంఘం నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షులుగా మురిడప్ప, రామకృష్ణ, అధ్యక్షులుగా గంగాధర్, ఉపాధ్యక్షులుగా రవి, నాగేష్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశులు, సహాయ కార్యదర్శిగా లక్ష్మన్న, ఆంజనేయులు, కోశాధికారిగా హనుమంత ఎన్నికయ్యారు. పట్టణ కమిటీ గౌరవాధ్యక్షులుగా రుద్రప్ప, అధ్యక్షులుగా గాలెప్ప, ఉపాధ్యక్షులుగా రాము, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, సహాయ కార్యదర్శిగా రామాంజనేయులు, కోశాధికారిగా మురుడప్ప ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అయినప్పటికీ సంచార జాతులు కనీసం తమ హక్కులను కాపాడుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంచార జాతులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కుళ్లాయప్ప, మాజీ ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'నిత్యసురభి' సేవలు

రాజు దంపతులకు సరుకులు అందజేస్తున్న నిర్మలమురళి

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు జిల్లాలోనే కాకుండా పక్క రాష్ట్రానికి కూడా పాకాయి. తెలంగాణ రాష్ట్రం, కరీంనగర్ జిల్లా, జమ్మిగుట్ట మండలం, జమ్మిగుట్ట గ్రామంలో ఇటీవల భావన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు రాజు అనే వ్యక్తి కింద పడి కాలు విరిగింది. ఆపరేషన్ చేసి రాడ్లు వేశారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రాజు విషయం సెల్‌ఫోన్‌లో తెలుసుకున్న నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులతోపాటు ఆయన భార్య స్వప్నకు చీరను, అలంకరణ వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కాకతీయ, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి రైతుసంఘం జిల్లా మహాసభలు

జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈనెల 27, 28వ తేదీల్లో గార్లదిన్నెలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం 13వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఎపి రైతుసంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలో జిల్లాలోని రైతాంగ సమస్యలపై తీర్మానాలు ఆమోదించడంతోపాటు నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలపారు. ఇప్పటికే రైతు సంఘం ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా అనేక రైతాంగ సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ప్రధానంగా జిల్లాలో సాగునీటి సమస్య పరిష్కారానికి జలాగ్రహ దీక్ష 24 గంటల పాటు చేశామన్నారు. పంట నష్టపరిహారం, పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉరవకొండ నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు పాదయాత్ర చేసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశామన్నారు. అలాగే 544-డి రోడ్డు నిర్వాసితులకు పరిహారం ఇచ్చేంత వరకు పోరాటం చేశామన్నారు. వీటితోపాటు అనేక పోరాటాలు చేశామన్నారు. ఈ మహాసభలో జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 27, 28వ తేదీల్లో గార్లదిన్నెలో ర్యాలీ, బహిరంగ సభ ఉంటాయన్నారు. ఈ మహాసభలకు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని రైతులందరూ పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, బిహెచ్ రాయుడు, జిల్లా కమిటీ సభ్యులు వలి, సంజీవరెడ్డి, వెంకటకొండ, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం సమగ్రాభివృద్ధికి కృషి

విప్ కాలవ శ్రీనివాసులు

భూమిపూజ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని చర్చి ఏరియాలో ఉన్న డాక్టర్ జాన్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో లిడియా జాన్ మెమోరియల్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీర్వాదంతో 2014-19లో రాయదుర్గం నియోజకవర్గం కొంతమేరకు అభివృద్ధి చేశామన్నారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. మళ్లీ ఇప్పుడు తనను ప్రజలు ఆశీర్వదించడంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం తన కర్తవ్యమన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్న ఒక ఉక్కు పరిశ్రమ విస్తరణ చేయనుండగా, మరో కొత్త ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కాబోతోందన్నారు. కనీసం 5వేల మంది యువతీ యువకులకు ఉపాధి కల్పించే పెద్ద టెక్స్‌టైల్ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. చతుర్ముఖ పశుపతి, ప్రసన్న వెంకటరమణ స్వామి, దశభుజ గణపతి, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాలు, ఉడేగోళం శివాలయం, కొండాపురం ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. అలాగే కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబుతో కలిసి బిటిపి ఎత్తిపోతల పనులను తిరిగి ప్రారంభించామన్నారు. కమ్యూనిటీ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ జాన్ కుమారులు సుధీర్ మాట్లాడుతూ తమ చర్చి ఆవరణలో ఏర్పాటు చేయనున్న కమ్యూనిటీ డెవలప్మెంట్ సెంటర్ పట్టణంలో ఉన్నత ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన శిక్షణ కేంద్రం, మహిళా సాధికారత రూపకల్పనకు అందరూ ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ ఆత్మకూరు గోపాలరావు, రిటైర్డ్ టీచర్ పరిమళ, జాన్ కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు నాగరాజు, పురుషోత్తం, ప్రశాంతి, ప్రజలు పాల్గొన్నారు.

దళిత ఉద్యమ కెరటం డాక్టర్ కత్తి పద్మారావు

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

కత్తి పద్మారావును సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి - అనంతపురం

అంబేద్కర్ భావ జాలాన్ని లోతుగా అవగాహన చేసుకుని దళిత ఉద్యమ పతాకాన్ని ఎగురవేసిన ఘనుడు డాక్టర్ కత్తి పద్మారావు అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ఆడిటోరియంలో ప్రముఖ దళిత మేధావి, తత్వవేత్త డాక్టర్ కత్తి పద్మారావుకు శ్రీమతి విమల స్మారక సాహిత్య జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. కుల వివక్ష కలిగిన భారతీయ సమాజంలో చారిత్రక కాలం నుంచి కుల రహిత సమాజం కోసం ఉద్యమ పోరాటాలు జరిగాయన్నారు. ఈ క్రమంలో గౌతమ బుద్ధుని నుంచి అంబేద్కర్ దాకా వర్ణ వివక్షకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలను ప్రస్తావించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తర్వాతనే దళిత కులాల అస్తిత్వ ఉద్యమ చైతన్యాన్ని ప్రోది చేసుకున్నాయని విశ్లేషించారు. కార్యక్రమానికి ప్రధాన వక్త డాక్టర్ కోయి కోటేశ్వరరావు కత్తి పద్మారావు గారి జీవితాన్ని సాహిత్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, విశిష్ట అతిథి పిఎల్ఎన్ రెడ్డి, పురస్కార ప్రదాత శాంతి నారాయణ, తూముచెర్ల రాజారాం, దాసరి ఆదినారాయణ, మధురశ్రీ, అంకే శ్రీనివాస్, కొత్తపల్లి సురేష్, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రహదారుల నిర్మాణం

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్ ఉన్న రైల్వే కాలనీలో సిసి రహదారుల నిర్మాణం అస్తవ్యస్తంగా తయారైంది. కొన్ని నెలల క్రితం రైల్వే కాలనీలో సిసి రహదారుల నిర్మాణంకు నిధులు మంజూరయ్యాయి. ఆయా పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు కాలనీలో అసంపూర్ణంగా సీసీ రహదారులను నిర్మించి పనులు ఆపేశారు. దీంతో రాత్రిపూట చీకటిగా ఉండటంవల్ల అసంపూర్ణంగా నిలిచిపోయిన సీసీ రహదారులపై వాహనదారులు, కార్మికులు, పాదాచారులు వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు .ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి సీసీ రహదారుల పనులను పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.

నూతనంగా వేసిన సిమెంటు రోడ్డు

గుత్తిలో ఎక్కడికక్కడ నిలిపోయిన వాహనాలు

గుత్తిలో ట్రాఫిక్ జామ్

ఆందోళనలో వాహనదారులు, ప్రజలు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తిలో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక గాంధీ కూడలిలో దాదాపు గంటసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. రహదారులు కుదించకపోవడంతో పాటు గాంధీ కూడలి ఇరుగ్గా ఉంది. దీంతో భారీ వాహనాలు గాంధీ కూడలిలోకి రావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. గుత్తి పట్టణం వెలుపల చేపట్టిన జాతీయ సిసి రహదారి పనులు అసంపూర్ణంగా నిలిచిపోయాయి. దీంతో పట్టణం గుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇలా భారీ వాహనాలు వచ్చు సమయంలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. సంబంధిత అధికారులు జాతీయ సిసి రహదారి పనులు పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పలువురు వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

12న 'ప్రజాఉద్యమం' ర్యాలీ

కళ్యాణదుర్గం టౌన్ : రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 12వ తేదీన నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు వైసిపి సమన్వయకర్త రంగయ్య తెలిపారు. ఈమేరకు ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నారాయణ, కన్వీనర్లు గోళ్ల సూరి, ఎంఎస్ హనుమంతురాయుడు, ఎంపిపిలు చంద్రశేఖర్‌రెడ్డి, మారుతమ్మ, కౌన్సిలర్లు లీగల్‌సెల్ నాయకులు హనుమంతురెడ్డి, ఎర్రిస్వామి, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

తాడిపత్రి రూరల్ : పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ప్రజా ఉద్యమం ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా భాగంగా ఈనెల 12వతేదీన ప్రజా ఉద్యమ ర్యాలీలో నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ ర్యాలీలో వైసిపి శ్రేణులతోపాటు ప్రజలు, యువకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థలం, ఇంటి కోసం దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు : మండలంలో స్థలం, ఇల్లు లేని పేదలు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఎఇ సంధ్యారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 30వతేదీ వరకు సమీపంలోని సచివాలయాలకు వెళ్లి పిఎంవై, జిస్కీమ్ కింద దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి

అనంతపురం : విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వినియోగదారులు మొబైల్ నెంబర్ 89777 16661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను తెలపవచ్చన్నారు.

కోటి సంతకాల సేకరణ

పుట్లూరు : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కందిగోపుల గ్రామంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కాగా మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో సోమవారం ఈనెల 12వతేదీన నిర్వహించనున్న ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించనున్నట్లు మండల కన్వీనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకులు ఆకుల శ్రీరాములు మృతి

నార్పల : మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు ఆకుల శ్రీరాములు (85) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. శ్రీరాములు కొద్దికాలంగా అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యారు. ఈయన గతంలో ఆకుల రామప్ప పెద్ద కుమారునిగా ఆకుల వర్గానికి పెద్దదిక్కుగా నార్పల రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. శ్రీరాములు మృతి విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, స్థానికులు మృతదేహానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నగర సమీపంలోని శిల్పారామంలో శ్రేయ ఎకో వరల్డ్ వారి సహకారంతో శ్రీ రాజేశ్వరీ పదన్యాస నృత్యాలయం అకాడమీ వారు శాస్త్రీయ, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకూ సాగాయి. ఈ కార్యక్రమంలో కళాకారులు శ్రీ రాజశ్వరి, అధా లక్ష్మి, సయతి, రుతిక, గానవి, హవిత, పనిత, తదితరులు పాల్గొన్నారు.

చెంగల్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం

అనంతపురం : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సుదీర్ఘ పరిశోధనలో భాగంగా వి.చెంగల్ రెడ్డికి ఆదివారం డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. జెఎన్‌టియు ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, ప్రొఫెసర్ జి.హరినాథ్‌గౌడ్ పర్యవేక్షణలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో 'ఎంపిరికల్ మోడలింగ్, అనాలసిస్, ఆప్టిమైజేషన్ ఆఫ్ లేజర్ మైక్రో మెషినింగ్ బై యూజింగ్ ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్వర్క్ అండ్ జెనెటిక్ అల్గారిదంస్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు వి.చెంగల్‌రెడ్డికి డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన చెంగల్ రెడ్డి పలువురు అభినందించారు.

ఆత్మగౌరవం కోసమే ఆందోళన

అనంతపురం కలెక్టరేట్ : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు కళ్యాణదుర్గం పర్యటనలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయకుండా అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడకుండా వెళ్లిపోవడాన్ని ఆవేదన చెంది ఆందోళన చేశామని వికెసి పార్టీ రాష్ట్ర కార్యదర్శి మందల రమేష్ అన్నారు. ఆదివారం ఆర్‌బి అతిథిగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గంలోని భక్త కనకదాస విగ్రహావిష్కరణకు వచ్చిన మంత్రి లోకేష్ అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయకుండా వెళ్లడం బాధాకరమన్నారు. ఈ క్రమంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర ఉన్న దళిత సంఘాల నాయకులు, దళిత సంఘాల నేతలు ఆందోళన చేశాయన్నారు. తమ ఆత్మగౌరవానికి భంగం కలిగించడంతో ఆందోళన చేశామేగానీ ఇంకో ఉద్దేశం లేదన్నారు.

నేరాలు ఘోరాలు

గొర్రెల దొంగలు అరెస్టు

గుత్తి : పట్టణంలోని గుత్తి పోర్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం గొర్రెలు దొంగలను గుత్తి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ ఎం.రామారావు, ఎస్ఐ కె.సురేష్ వివరాలను తెలిపారు. మండలంలోని గొందిపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు గొర్రెల కాపరులకు సంబంధించిన 16 గొర్రెలను దొంగలు అపహరించుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన సిఐ, ఎస్ఐ మండలంలోని టి.కొత్తపల్లికి చెందిన పెనుగొండ నారాయణ, పెనుగొండ శ్రీనివాసులును అరెస్టు చేసి రూ.1,92 లక్షల విలువజేసే 16 గొర్రెలను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ ఆజాద్, హెడ్ కానిస్టేబుల్ రాజ్ కమార్, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో చోరీ

తాడిపత్రిరూరల్ : పట్టణంలోని కృష్ణాపురం 3వ రోడ్డులో నివాసం ఉండే మల్లీశ్వరి ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. కుటుంబ సభ్యులతో కలిసి బళ్లారి వెళ్లి తిరిగి వచ్చిన మల్లీశ్వరి ఇంట్లోకి ప్రవేశించి చూడగా బీరువాలో ఉన్న 10 తులాల బంగారు, దేవుని మూల ఉన్న వెండి వస్తువులు చోరీ చేసినట్లు తెలుసుకుంది. వెంటనే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మొక్కజొన్న పంట ధ్వంసం

నేలవాలిన మొక్కజొన్న వద్ద రోదిస్తున్న బాధిత రైతులు

బొమ్మనహాల్ : మండలంలోని కురువల్లి గ్రామంలో ఎనిమిది ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఈమేరకు బాధిత రైతు రత్తమ్మ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ ఎనిమిదెకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేసేందుకు సుమారు రూ.1.20లక్షలు ఖర్చు అయిందని వాపోయింది.

పరుగు పందెంలో విద్యార్థుల ప్రతిభ

బుక్కరాయసముద్రం : పరుగు పందెంలో బుక్కరాయసముద్రం గిరిజన పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అర్జున్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పామిడిలో జరిగిన మిల్కా సింగ్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ అథ్లెట్ మీట్‌లో బుక్కరాయసముద్రం గిరిజన పాఠశాల విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారన్నారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో కూడా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

రిజిస్టర్ దస్తావేజు పోయినది.

తాడిపత్రి సబ్ రిజిస్టర్ పరిధిలోని 2008 సంవత్సరం లో **దస్తావేజు నెంబరు 85/2008 గా బోడగల శంకరముని S/o బోడగల మునిస్వామి** పేరున రిజిస్టర్ కాబడినది. ఈ దస్తావేజులు పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్ లో గాని,పట్టణంలోని DNo:1/531-2 లో నివాసం ఉండే బోడగల శంకరముని అయిన నాకు గానీ, తెలియజేయగలరని ప్రార్థన.
నా ఫోన్ నంబర్ 9848320424.

స్థల వివాదంలో ఘర్షణ

పలువురికి గాయాలు

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు, విలేకరులతో మాట్లాడుతున్న శైలజనాథ్

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని నాయనపల్లి గ్రామం దళిత కాలనీలో నెలకొన్న స్థల వివాదంలో ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడటంతో పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. నాయనపల్లి దళిత కాలనీలో ఉన్న ఆర్డీటీ పాఠశాల స్థలాన్ని కొందరు టిడిపి కార్యకర్తలు ఆక్రమించారని గతంలో కొందరు వైసిపి కార్యకర్తలు తహశీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం సమర్పించారు. దీంతో మండల సర్వేయర్, వీఆర్వోతో కలిసి తహశీల్దార్ సంబంధిత స్థలాన్ని పరిశీలించి హద్దులు వేశారు. ఈనేపథ్యంలో ఆదివారం ఆక్రమణకు గురైన స్థలం ఆర్డీటీ పాఠశాలకు అప్పచెప్పాల్సిందే అంటూ పలువురు అడ్డు చెప్పడంతో మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు రాళ్ల దాడి చేసుకున్నారు. గాయపడిన వారిని 108 ద్వారా అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వైసిపి ప్రేరేపణతోనే నాయనపల్లి ఘటన : ఎమ్మెల్యే

మండల పరిధిలోని నాయనపల్లి గ్రామంలో వైసిపి సానుభూతిపరుల ప్రేరేపణతోనే అల్లర్లు జరుగుతున్నాయని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నాయనపల్లి దళిత కాలనీలో జరిగిన సంఘటనపై విచారణ చేపట్టగా ఘర్షణకు కారణమైన స్థలం ఆర్డీటీ పాఠశాలకు సంబంధించింది కాదని, పూర్వం నుంచి మాజీ సర్పంచు వెంకట్రాముడు, తండ్రి ఓబులేసు కుటుంబం అనుభవంలో ఉన్న భూమి అని తేలిందన్నారు. ఈ స్థలంలో కేవలం పశువుల షెడ్డు గురించి నిర్మాణం చేపడితే ఫిర్యాదు చేశారన్నారు. మీకు ఇంకా సందేహాలు ఉంటే ఫిర్యాదు చేయాలేగానీ, ఇలా ప్రత్యక్షంగా దాడులకు దిగడం అత్యంత హేయమైన చర్య అన్నారు. హింసకు పాల్పడిన వారు ఎవరైనా కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు.

భూ కబ్జాల కోసమా అధికారం..

భూ కబ్జాలు చేసేందుకేనా ప్రజలు అధికారం ఇచ్చింది అంటూ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శైలజనాథ్ అన్నారు. నాయనపల్లిలో జరిగిన ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను శైలజనాథ్ అనంతపురంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీటీకి చెందిన కొంత స్థలం కాజేసి తన ఇంటికి కాంపౌండ్ కట్టుకున్నా.. ఎవరూ పట్టించుకోలేదన్నారు. అయితే ఉన్న స్థలాన్ని కూడా ప్రస్తుతం కాజేసి పశువుల షెడ్ నిర్మాణం చేపడుతుంటే అడ్డుకున్న వైసిపి కార్యకర్తలపై టిడిపి నాయకుడు ఓబులేసు, అనుచరులు రాళ్లతో దాడి చేయడం బాధాకరమన్నారు. కబ్జాకు గురైన స్థలాన్ని రక్షించడంతోపాటు వైసిపి కార్యకర్తలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.